ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతాం



కార్పొరేటర్లతో కలిసి చార్జిషీట్‌ను విడుదల చేస్తున్న సామ రంగారెడ్డి

సామ రంగారెడ్డి

మన్సూరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలన వైఫల్యాలు, నెరవేరని హామీలు, మరిచిన వాగ్దానాలపై ప్రజలను చైతన్యం చేయనున్నట్లు బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరితమైన గ్యారంటీలు, అబద్ధాలు ఎల్‌బీనగర్ నియోజకవర్గ సమస్యలపై మంగళవారం ఆయన జిల్లా పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్లతో కలిసి చార్జిషీట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ.. ఏడాది పాలనలో ఏదో సాధించినట్లు కాంగ్రెస్ పార్టీ ఉత్సవాలను జరుపుకుంటుందని, రేవంత్‌రెడ్డి నియంతృత్వ, అప్రజాస్వామిక పాలనలో గోస పడుతున్న ప్రజలకు భరోసా ఇచ్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తుందన్నారు. ఈ నెల 7న సాయంత్రం 3 గంటలకు సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు, ఈ సభకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా హాజరవుతున్నట్లు స్పష్టంచేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో 100 రోజుల్లో 6 గ్యారంటీలు, ఏడాదిలో 66 వాగ్దానాలను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజాక్షేత్రంలో ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు. మునుగోడు ఉప ఎన్నికల సమయంలో హడావుడిగా తెచ్చిన 118జీవోతో స్థానిక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. డబ్బులు పెట్టి కొన్న ప్లాట్ల యాజమానులను కబ్జా కోరులుగా 118 జీఓ పేర్కొనడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వంగ మధుసూదన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, చింతల అరుణసురేందర్‌యాదవ్, నియోజకవర్గ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి



ర్యాలీలో పాల్గొన్న ఆర్.కృష్ణయ్య

లింగోజిగూడ: విద్యార్థుల ఫీజులు, స్కాలర్ షిప్‌లు విడుదల చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, కాంట్రాక్టర్లకు బిల్లులు విడుదల చేస్తున్నారు కానీ.. విద్యార్థులు ఫీజులు మాత్రం చేయడం లేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. బీసీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం ఎల్‌బీనగర్ బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో కృష్ణయ్య పాల్గొని మాట్లాడారు. కొందరు అధికారులు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తేయాలని కుట్రలు చేస్తునారని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఏర్పాటు చేసిన 16 ఏళ్లలో ఇంటికి ఇద్దరు ముగ్గురు ఉన్నత చదువులు చదివారని ఇటీవల నిర్వహించిన సామాజిక సర్వేలో ఇతర దేశాలకు వెళ్లిన వారిలో 40 శాతం మంది తెలుగు వారే ఉన్నట్లు తేలిందన్నారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్ స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుజ్జకృష్ణ,అంజి, మల్లేష్ యాదవ్, రాజేందర్, సతీష్, రామకృష్ణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

లింగోజిగూడ: డివిజన్ పరిధిలోని జనప్రియ అపార్ట్‌మెంట్‌లలో మంగళవారం జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్‌తో కలిసి కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి పర్యటించారు.ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. జనప్రియ అపార్ట్‌మెంట్‌లలో ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ ప్లే గ్రౌండ్ ఏర్పాటు చేయాలని కోరారు. కాలనీలో వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు రోడ్లకు మరమ్మత చేపట్టాలని తెలిపారు. పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉందని ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. అనంతరం జోనల్ కమిషనర్ మాట్లాడుతూ.. తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ధ్వంసమైన ఫుట్‌పాత్‌లు, రోడ్లకు మరమ్మతు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బీనగర్ సర్కిల్ డీసీ సేవా ఇస్లావత్, సిటిప్లానర్ శ్రీనివాస్ యాదవ్, ఈఈ కార్తీక్, శానిటేషన్ డీఈ నగేష్ నాయక్, జీహెచ్‌ఎంసీ విద్యుత్ డీఈ పున్నా నాయక్, ఏఈ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



జనప్రియ అపార్ట్‌మెంట్‌లో పర్యటిస్తున్న హేమంత కేశవ్ పాటిల్

దశలవారీగా సమస్యలకు పరిష్కారం



వినతిపత్రం ఇస్తున్న కాలనీ సంక్షేమ సంఘం నేతలు

మన్సూరాబాద్: డివిజన్ సమస్యలను పరిష్కరించేందుకు ముందుంటానని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి స్పష్టం చేశారు. హయత్‌నగర్ పరిధి నందిహిల్స్‌కాలనీలో మంగళవారం ఆయన పర్యటిస్తూ మాట్లాడారు. శివారు ప్రాంత ప్రజలు సకాలంలో ఇంటి పన్నులు చెల్లిస్తున్నా వారికి మౌలిక వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. చిన్నపాటి వర్షానికే శివారు ప్రాంతాల రోడ్లు గుంతలమయంగా మారి గ్రామీణ ప్రాంతాలను తలపిస్తున్నాయన్నారు. కాలనీలో కమ్యూనిటీహాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని, కాలనీలోని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భిక్షపతి గౌడ్, ఈశ్వరయ్య, విష్ణువర్ధన్, కృష్ణారెడ్డి, విజయ్‌కుమార్, రాజేశ్వరీ, సురేందర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, కుమార్ యాదవ్, రవి, లక్ష్మి పాల్గొన్నారు.

లాడ్జిలో వ్యక్తి ఆత్మహత్య



అనిల్‌కుమార్ (ఫైల్)

లింగోజిగూడ: లాడ్జిలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా నర్సారావుపేటకు చెందిన కొల్లు అనిల్‌కుమార్(33) భార్యతో కలిసి భాగ్యలత బీడీఎల్ కాలనీలో ఉంటూ హయత్‌నగర్‌లో తాజాహోటల్ నిర్వహిస్తున్నారు. సోమవారం తన మిత్రుడు అనిల్ పుట్టినరోజు ఉందని చెప్పి బయటికివెళ్లిపోయాడు. సాయంత్రం 4 గంటలకు భార్య ప్రవల్లిక ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. కాసేపటి తర్వాత మళ్లీ ఫోన్ చేయగా అనిల్ మిత్రుడు హరిక్రిష్ణ ఫోన్‌లేపి భాగ్యలతలోని చైత్ర యోయోలాడ్జిలో ఉరివేసుకున్నట్లు తెలిపాడు. ప్రవల్లిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకొస్తా

ఎమ్మెల్యే సబితారెడ్డి

పహాడీషరీఫ్: పేదలు నివాసం ఉంటున్న జల్‌పల్లి మున్సిపాలిటీలో ఏడాదిలోపు 30 పడకల ఆస్పత్రి నిర్మించేలా చూస్తానని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో 231 మంది మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంగళవారం ఆమె పహాడీషరీఫ్‌లోని ప్రీమియర్ ఫంక్షన్‌హాల్‌లో చైర్మన్ అబ్దుల్లా సాది, బాలాపూర్ తహసీల్దార్ ఇందిరా, జల్‌పల్లి కమిషనర్ వెంకట్రామ్‌లతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేవలం ఒక్క జల్‌పల్లి మున్సిపాలిటీలోనే 4,600 మంది లబ్ధిదారులకు షాదీ ముబారక్ చెక్కులను అందించామన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఈ పథకానికి రూ.1లక్ష నగదుతో పాటు తులం బంగారాన్ని కూడా అందించాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్ చుట్టూ ఉన్న మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో తాగునీటి అవసరాలు తీర్చేందుకు రూ.1200 కోట్ల వ్యయంతో రిజర్వాయర్లు, పైపులైన్ల పనులకు శ్రీకారం చుట్టారన్నారు. ఇందులో ఆరు రిజర్వాయర్లు పూర్తి కావడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రస్తుతం ప్రారంభిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్క మహేశ్వరం నియోజకవర్గంలోనే 13 బస్తీ దవఖానాలు, తొమ్మిది యూపీహెచ్‌సీలు మంజూరు చేశారన్నారు. కానీ ప్రస్తుతం బస్తీ దవఖానాలలో వైద్యులు లేకపోవడంతో పాటు మందులు కూడా దొరకని దుర్భర పరిస్థితి నెలకొందన్నారు. ఇక బాలింతలకు ఇచ్చే కిట్‌ను కూడా మరిచారన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాల కల్పనకు గతంలో మంజూరైన రూ.50కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులను రద్దు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదలపై ప్రేమ ఉంటే వెంటనే విడుదల చేయాలని కోరారు. కృష్ణారెడ్డి, కైసర్ బామ్, హామెద్, అఫ్జల్, జనార్దన్, యూసుఫ్ పటేల్, ఎక్బాల్ ఖలీఫా, అలీ మన్సూరీ పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కులను సంరక్షించాలి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీదేవి, వేదికపై శ్యామలా దేవి



ట్రై సైకిళ్లతో దివ్యాంగులు

సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి

నాగోలు: దివ్యాంగుల హక్కుల సంరక్షణకు చేయూతనివ్వాలని సీనియర్ సివిల్ జడ్జి, రంగారెడ్డి జిల్లా న్యాయ సేవా సంస్థ న్యాయమూర్తి శ్రీదేవి పేర్కొన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం కొత్తపేట మోహన్‌నగర్‌లోని మానస స్పెషల్ స్కూల్‌లో సుస్థిర భవిష్యత్‌పై భరోసా అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. జాతీయ న్యాయ సేవల సంస్థ నిర్దేశాల మేరకు, రంగారెడ్డి జిల్లా న్యాయస్థానం ప్రాంగణంలో ఉన్న జిల్లా న్యాయ సేవల సంస్థలో మానసిక రోగులు, మానసిక దివ్యాంగుల సేవల కోసం ఓ ప్రత్యేక విభాగాన్ని ఏర్పరుస్తున్నట్లు ప్రకటించారు. జిల్లా పిల్లల సంక్షేమ కమిటీ చైర్మన్‌గా పనిచేసిన శ్యామలా దేవి మాట్లాడుతూ.. కొంతమంది తల్లిదండ్రులు భారం మోయలేమని భావించి దివ్యాంగులైన తమ సొంత పిల్లలను వదిలివేయడం చాలా బాధాకరమన్నారు. వారికి ప్రభుత్వ ఆధ్వర్యంలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడం ఎంతో అవసరమన్నారు. ఆహార భద్రతా ప్రమాణాల జాతీయ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ బాలునాయక్ కేతావత్ మాట్లాడుతూ.. దివ్యాంగుల జీవన ప్రమాణాలను మెరుగు పరిచే సాంకేతిక పరికరాలు రూపొందించి అవసరమైతే వాటిపై పేటెంటు రిజిస్టర్ చేసుకొనేందుకు సేవా తత్పరత కలిగిన స్వచ్ఛంద సంస్థలు ప్రయత్నించాలని కోరారు.

అండగా నిలవాలి..

లింగోజిగూడ: దివ్యాంగులకు ప్రతి ఒక్కరూ అండగా నిలుస్తూ వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్సీ దయానంద్, పలువురు కార్పొరేటర్లు తెలిపారు. జీహెచ్‌ఎంసీ మూడు సర్కిళ్ల ఆవరణలో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అలీం అండ్ కో సంస్థ ఆందజేసిన ట్రై సైకిళ్లను దివ్యాంగులకు అందజేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. దివ్యాంగుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలను అమలు చేస్తున్నాయని వాటిని సదినియోగం చేసుకోవాలన్నారు. ఎన్నో స్వచ్ఛంద సంస్థలు దివ్యాంగుల అభ్యున్నతికి సహాయ సహకారాలు అందజేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, వంగ మధుసూధన్‌రెడ్డి, సుజాతనాయక్, ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, రంగ నర్సింహాగుప్తా, రాదాధీరజ్‌రెడ్డి, డీసీలు తిప్పర్తి యాదయ్య, సేవా ఇస్లావత్, సుజాత పాల్గొన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు.. టమాట రూ. 35, వంకాయ రూ. 28, బెండ రూ. 35, పచ్చిమిర్చి రూ. 28, కాకర రూ. 26, బీర రూ. 35, క్యాబేజి రూ. 25, ఫ్రెంచిబీన్స్ రూ. 40, క్యారట్ రూ. 60, దొండ రూ. 28, చిక్కుడు రూ. 45, గోకర రూ. 28, బీట్‌రూట్ రూ. 45, క్యాప్సికం రూ. 60, ఆలు రూ. 35, దోస రూ. 30, సొరకాయ రూ. 13, పొట్లకాయ రూ. 18, ఉల్లిగడ్డ రూ. 35, చామగడ్డ రూ. 45. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

దరఖాస్తుల స్వీకరణ

చాదర్‌ఘాట్: ట్రాన్స్‌జెండర్స్‌కు సమాజంలో గుర్తింపు ఇవ్వాలనే ఉద్దేశంతో ట్రాన్స్‌జెండర్స్‌ను వలంటరీ ట్రాఫిక్ అసిస్టెంట్‌గా నియమించాలని వికలాంగుల, వయోవృద్ధుల, ట్రాన్స్‌జెండర్స్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. వయస్సు 18-40 ఉండాలని, ఫిజికల్ టెస్టులు హోమ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారన్నారు. గోషామహల్‌లోని ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఫిజికల్ టెస్టులు నిర్వహిస్తారని ఎంపికైన వారికి వేతనాలు గౌరవ ప్రదంగా ఉంటాయన్నారు. దరఖాస్తులను వికలాంగుల సంక్షేమ కార్యాలయంలోని ట్రాన్స్‌జెండర్స్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

భార్య ఆత్మహత్యకు కారణమైన వ్యక్తికి ఏడేళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: భార్యను చిత్రహింసలకు గురిచేసి ఆమె ఆత్మహత్యకు కారణమైన తొర్పునూరి లింగస్వామి (30)కి రంగారెడ్డి జిల్లా 4వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి కవిత ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధించారు. కోర్టు ఏపీపీ శోభారాణి వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం అనాజ్‌పూర్ గ్రామానికి చెందిన తొర్పునూరి లింగస్వామికి 2012లో నవీనతో వివాహం జరిగింది. వారికి ఇద్దరు సంతానం. మద్యానికి బానిసైన లింగస్వామి నిత్యం భార్యను వేధించేవాడు. పలుమార్లు గొడవలు జరిగితే పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టి మందలించారు. 2018లో మద్యం మత్తులో లింగస్వామి భార్యను పిల్లల ముందే విపరీతంగా కొట్టడంతో నవీన ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. తీవ్రంగా గాయపడిన నవీనను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా, సాక్షులను విచారించిన కోర్టు మంగళవారం శిక్ష ఖరారు చేస్తూ తీర్పునిచ్చింది.

ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే చర్యలు తప్పవు



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

నాగోలు: ఫుట్‌పాత్‌లు ఆక్రమించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎల్‌బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం కొత్తపేట, రైతుబజారు ముందు సర్వీస్ రోడ్డుకి ఇరువైపులా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న పలు ఆక్రమణలను తొలగింపజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రైతుల ముసుగులో దళారులు రోజువారి కూలీలను పెట్టి మరీ రోడ్డుకి ఇరువైపులా తోపుడు బండ్లు, ఆటోలో పండ్లు, కూరగాయలు అమ్ముతూ నిత్యం ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్నారని అన్నారు. అలాంటి వారికి గుర్తించి జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని బీఆర్‌ఎస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షులు పెండ్యాల నగేష్ అన్నారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం ఆర్.కె.పురం డివిజన్ అల్కాపూరిలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన నాణ్యతపై ఆరా తీశారు. ఈ సందర్భంగా అరవింద్ శర్మ మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలలో కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, నిత్యం ఏదో ఒక గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారంతో కొందరు, అనారోగ్యంతో మరి కొందరు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో 51 మంది విద్యార్థులను పొట్టన పెట్టుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకుల పాఠశాలలను పట్టించుకోకుండా వదిలేశారని ఆరోపించారు. పాఠశాలలో వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరతను తీర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, పెంబెరీ శ్రీనివాస్, భూపాల్ రెడ్డి, శేఖర్ రెడ్డి, రమేష్ కుర్మా, జగన్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలుకు వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మలక్‌పేట: తెలంగాణ మాదిగ రాజకీయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చిట్టుపాక ప్రభాకర్ మాదిగ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై విచారణ జరిపిన న్యాయ కమిషనర్ సమీమ్ అక్తర్‌ను మంగళవారం బీఆర్‌కే భవన్‌లో కలిశారు. ఎస్సీ వర్గీకరణలో మాదిగ, మాదిగ ఉపకులాల జనాభా ప్రకారం వర్గీకరణ అమలు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2000-2004 మధ్య ఎస్సీ సబ్ క్లాసిఫికేషన్(ఏ,బీ,సీ,డీ) అమలు సమయంలో మాదిగను ఎస్సీ-బీ కేటగిరిలోకి తీసుకున్నారన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 32,33,642 జనాభా ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న మాదిగ, మాదిగ ఉపకులాల జనాభా లెక్కలు సేకరించి పెరిగిన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. అసెంబ్లీ సాక్షిగా ఎస్సీ వర్గీకరణ చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి మాట నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. కొయ్యాడ వెంకటస్వామి మాదిగ, శ్రీను మాదిగ పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల పేరుతో మోసం

బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీరాములుయాదవ్



మాట్లాడుతున్న శ్రీరాములుయాదవ్

బడంగ్‌పేట్: ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. మంగళవారం నాదర్‌గుల్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వందరోజుల్లో అమలు చేస్తామని, ఏడాది గడిచినా హామీలను అమలు పరచడం లేదని ధ్వజమెత్తారు. రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, నెలకు రూ.4వేల నిరుద్యోగ భృతి, తులం బంగారం, రుణమాఫీ చేస్తామని గొప్పలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. మహేశ్వరం నియోజకవర్గానికి సబితారెడ్డి ఇచ్చిన హామీలను రేవంత్‌రెడ్డి సర్కారు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే బీజేపీ ప్రశ్నిస్తూనే ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు శంకర్‌రెడ్డి, పాపయ్యగౌడ్, జంగయ్యయా దవ్, సుదర్శన్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, రాజుగౌడ్, రాధాధీరజ్‌రెడ్డి, సంతోష్ తదితరులు ఉన్నారు.

ఇందు అరణ్య అపార్టుమెంట్ సముదాయంలో ఉద్రిక్తత

నాగోలు: నాగోలు-బండ్లగూడ శివారులోని హౌసింగ్ బోర్డు, ఇందు ప్రాజెక్టు సంయుక్తంగా నిర్మించిన ఇందు అరణ్య అపార్టుమెంట్ నివాస సముదాయంలో ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. మంగళవారం రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ అధికారులు ఇందు అరణ్య నివాస సముదాయంలో మిగిలిన ఖాళీ స్థలాలను స్వాధీనం చేసుకొని ప్రహరీ నిర్మించేందుకు రెవెన్యూ అధికారులు, పోలీస్ బందోబస్తుతో రాగా వారిని అపార్టుమెంట్ వాసులు అడ్డుకున్నారు. ముందస్తుగా నోటీసులు, సంబంధిత పత్రాలను చూపించాలని అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణ సంస్థ ఈఈ రాధకృష్ణ మాట్లాడుతూ.. ఇందు సంస్థకు కేటాయించిన స్థలంలో ప్రాజెక్టును నిబంధనల ప్రకారం నిర్మించకపోగా, కార్పొరేషన్‌కు బకాయి పడిందన్నారు. సంస్థ ఎండీ ఆదేశాల మేరకు మిగిలిన స్థలాన్ని స్వాధీనం చేసుకోవడానికి వచ్చినట్లు తెలిపారు. ఇందు పల్లవి అపార్ట్‌మెంట్ వాసులు మాట్లాడుతూ.. ఇది హౌసింగ్ బోర్డు నిర్లక్ష్యంతో మాకు అన్యాయం జరుగుతుందని 15 ఎకరాల్లో మొత్తం 22 బ్లాక్‌లకు 17 బ్లాక్‌లు మాత్రమే నిర్మించారని అన్నారు.మిగిలిన 5 బ్లాకులను ఈ ఖాళీ స్థలంలోనే నిర్మించాల్సి ఉందని అది కాకుండా ఇప్పుడు ఆ ఖాళీ స్థలంకు అపార్ట్మెంట్‌కు మధ్యలో గోడ నిర్మించి స్థలాన్ని ఆక్రమించుకుంటానడం విడ్డూరంగా ఉందన్నారు.



ఇందూ పల్లవి అపార్ట్‌మెంట్‌లో పర్యటిస్తున్న అధికారులు

ప్రజా సంక్షేమమే లక్ష్యం



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: ప్రజా సంక్షేమమే తన లక్ష్యమని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గానికి చెందిన పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు.

దేవస్థానం పాలకవర్గం సమావేశం



సమావేశమైన పాలకవర్గ సభ్యులు

వనస్థలిపురం: వనస్థలిపురం ఫేజ్-1 లోని భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో పాలకవర్గ సభ్యులు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. భక్తుల సౌకర్యార్థం దేవాలయ ప్రాంగణంలో రూ.5 లక్షలతో రేకుల షెడ్డు నిర్మించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ శ్రవణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి దివాకర్ లింగం, శైలేష్, శ్రీకాంత్, కుశాల్‌కుమార్, మల్లికార్జున్, నందీశ్వర్ పాల్గొన్నారు.

శ్రీకాంతాచారికి నివాళి



శ్రీకాంతాచారి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

మన్సూరాబాద్: తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి వర్ధంతిని ఎల్‌బీనగర్‌లోని పలు ప్రాంతాల్లో మంగళవారం నిర్వహించారు. ఎల్‌బీనగర్‌లోని కాసోజు శ్రీకాంతాచారి విగ్రహానికి ఉద్యమకారులు, పలు సంఘాల నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో..



నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

చైతన్యపురి: తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా మలక్‌పేట, ఎల్‌బీనగర్ నియోజకవర్గాల విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. గడ్డిఅన్నారం డివిజన్ మధురాపురి కాలనీలోని స్వర్ణకార వీధిలో జరిగిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ.. ఎల్‌బీనగర్ చౌరస్తాకు శ్రీకాంతాచారి పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రామదాసు రవిచారి, కార్యదర్శి తుడిమళ్ల లవకుమార్, కోశాధికారి వెంకటరమణ, ఉపాధ్యక్షుడు శ్రీరామదాసు వెంకటాచారి, బావోజు రవి, అనంతాచారి, గోవర్ధనాచారి, రవిచారి, మనోజ్, రవి, నారాయణ, ప్రభాకరాచారి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు



శిబిరంలో పాల్గొన్న కార్మికులు

లింగోజిగూడ: పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వహించాలని ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్, జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ప్రజాపాలన ఉత్సవాల్లో భాగంగా మంగళవారం లింగోజిగూడ డివిజన్ పరిధిలోని జానకీ ఎన్‌క్లేవ్ కమ్యూనిటీ హాల్లో అవేర్ ఆసుపత్రి సహకారంతో పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రజాపాలనతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ప్రజాపాలన ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తామన్నారు.

హస్తినాపురంలో..



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సుజాతానాయక్

హస్తినాపురం: పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యం కాపాడేందుకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం హస్తినాపురం డివిజన్ వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన్నింటిని ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందని, ప్రజల కోసం ఏర్పాటైన ప్రజా ప్రభుత్వాన్ని దీవిస్తున్నారన్నారు.